: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 5 | 31-10-2022 | పుటలు : 4

## నవంబర్ 1

## ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం





భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి ప్రధానమైన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములుగారు. వారి ఆమరణ నిరాహార దీక్షతో, ప్రాణత్యాగంతో ఆంధ్రప్రదేశ్ అవతరించింది. వారికి ఘన నివాళిని అర్పిస్తూ వారిని స్మరిస్తోంది..

\- నన్నయవాణి

## ఫ్యాకల్టీ అసోసియేట్‌గా ఎ.విజయదుర్గ

### ఉత్తర్వులు అందించిన వీసీ జగన్నాథరావు



ఫాకల్టీ అసోసియేట్ గా బాధ్యతలందిస్తున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎగ్జామినేషన్ విభాగంలో ఫ్యాకల్టీ ఆసోసియేట్ గా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ ఈ.సి.ఈ అధ్యాపకులు ఎ.విజయదుర్గను నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందించారు. యూనివర్సిటీలో వీసీ కార్యాలయంలో విజయదుర్గకి ఉత్తర్వులు అందించిన వీసీ జగన్నాథరావు వివరాలను తెలియజేసారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ ఈ.సి.ఈ అధ్యాపకులు విజయదుర్గను ఫ్యాకల్టీ అసోసియేట్‌గా నియమించామన్నారు. విజయదుర్గ పరీక్ష విభాగానికి సంబంధించిన ఆటోమేషన్ సంబంధిత అంశాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. విశ్వవిద్యాలయ పరీక్ష విభాగానికి ఎంతో ఎక్కువ బాధ్యత ఉందని దానిని సమర్ధవంతంగా నిర్వహించాలని వీసీ జగన్నాథరావు సూచించారు.

# అన్ని కాలేజీలు నాక్ గుర్తింపును సాధించాలి

### యాప్షీ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ క్యూ.ఎ.సి. ఆచార్య కె.రామమోహనరావు




సమావేశంలో మాట్లాడుతున్న యాప్షీ వైస్ చైర్మన్ రామమోహనరావు

**27.10.22 (మీడియాసెల్)**

ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అన్ని కాలేజీలు నాక్ గుర్తింపును సాధించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ క్యూ.ఎ.సి. ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. గురువారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలతో యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో "ఇంటర్న్ షిప్, ఎసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ బై నాక్" అనే అంశంపై ఇంటరాక్టివ్ సెషన్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన యాప్షీ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ క్యూ.ఎ.సి ఆచార్య కె.రామమోహనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తుందని, దానికి తగిన సహకారాన్ని కళాశాలలు అందించాలన్నారు. 2021 జీవో ప్రకారం రాష్ట్రంలోని అన్ని కాలేజీలు అక్రిడిటేషన్ సాధించాలన్నారు. నాక్ గుర్తింపు ద్వారా కళాశాలల నాణ్యత ప్రమాణాలు తెలుస్తాయని, చక్కని అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కళాశాలలు నాక్ గుర్తింపును సాధించేందుకు అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. నాక్ గుర్తింపు ఉంటేనే త్వరలో కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని, విద్యారంగంలో నాణ్యతను పెంపొందించే కార్యక్రమాలను చేపడుతుందన్నారు. సర్టిఫికెట్టుల ద్వారా ఉద్యోగాలు రావని స్కిల్ ద్వారానే ఉద్యోగాలు వస్తాయన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. డిగ్రీ విద్యార్థులకు చక్కని ఇంటర్న్ షిప్ అవకాశాలను కల్పించారని తద్వారా విద్యార్థులకు ఆయా సంస్థలలో నైపుణ్యాలు అలవడి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. నాక్ గుర్తింపు దిశగా అన్ని కళాశాలలు అడుగులు వేయాలని, కళాశాలల నాణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు పెద్దపీఠ వేస్తుందని దానికి తగినట్టుగా కళాశాలలు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. నాణ్యమైన విద్యను అందించే గురువులు, వసతులు జాతీకి అవసరమన్నారు. కళాశాలలు నాణ్యత ప్రమాణాలను పెంచుకోవాలని, నాక్ సాధనకు అవసరమైన వనరులు, వసతులు సమకూర్చుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో నాక్ గుర్తింపును సాధించిన కొన్ని కళాశాలలు మెంటర్ కళాశాలలుగా వ్యవహరించి మిగిలిన కళాశాలలకు సహకరించాలన్నారు. ఇంటర్న్ షిప్ లను విజయవంతం చేసిన అందరిని అభినందించారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా చక్కని ఉద్యోగ ఉపాధి అవకాశాలు విద్యార్థులకు లభిస్తాయన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలలకు నాక్ సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. తరువాత ఆయా కళాశాలల ప్రతినిధులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేసారు. త్వరలో వైస్ చైర్మన్ సూచనలు పాటిస్తూ నాక్ దిశగా అడుగులు వేస్తామని, కళాశాలల అభివృద్ధిలో వీసీ జగన్నాథరావు ఎంతో సహకరిస్తున్నారని అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వి.ఆర్.ఎన్.నరసింహారావు తన అభిప్రాయాన్ని తెలియజేసారు. అనంతరం యాప్షీ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ క్యూ.ఎ.సి ఆచార్య కె.రామమోహనరావును వీసీ సన్మానించి జ్ఞాపికనందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ అకడమిక్ ఆఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డీన్ సిడిసి డా.పి.వెంకటేశ్వరరావు, ఐ.క్యూ.ఎ.సి. కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.



యాప్షీ వైస్ చైర్మన్ రామమోహనరావును సన్మానిస్తున్న ఉపకులపతి.

## సంపాదకీయం



# చందమామ

చందమామ రావే! జాబిల్లి రావే!! అని అమ్మ పాడిన అన్నమయ్య పాటతో ప్రతినెల పిల్లల ఒళ్ళో ప్రత్యక్షమయ్యేది రంగురంగుల బొమ్మలతో చందమామ.

అందులో... పట్టు వదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్లి చెట్టుపై నుంచి శవాన్ని దించి భుజాన వేసుకొని ఎప్పటిలాగే మౌనంగా శ్మశానంకేసి నడవసాగాడు. అప్పుడు

శవంలోని బేతాళుడు... రాజా! ఇంత అర్ధరాత్రి భీతి గొలిపే ఈ చీకటిలో చాలా పట్టుదలతో నీవు పడుతున్న శ్రమ చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. నీకు శ్రమ తెలియకుండా ఒక కథ చెబుతానని... ప్రతినెలా చందమామ పుస్తకంలో బేతాళుడు ఒక కథ చెప్పేవాడు. ఆకథ కోసం, అందమైన బొమ్మలకోసం, ఇంకా చాలా మంచి కథల కోసం ప్రతి నెల చందమామ పత్రిక కోసం ఎదురుచూసే వాళ్ళం.

చందమామ రూపకర్తలు నాగిరెడ్డి, చక్రపాణి గారలు. పత్రిక ఆలోచన నాగిరెడ్డి గారిదయితే రూపమిచ్చింది చక్రపాణి గారట. అప్పట్లో తొలి సంచిక ధర ఆరు అణాలు. మొదటి సంచిక ఆరువేల కాపీలు అమ్ముడుపోయాయట.

మంచి కథలు, పిల్లల చదివేలాగున సరళమైన శైలి,అందమైన బొమ్మలు, నాణ్యమైన ముద్రణ ఇవే చందమామ విజయాలు. మాంత్రికులు,దెయ్యాలు, భూతాలకథలు పత్రికకు అదనపు ఆకర్షణ.

కొడవటిగంటి కుటుంబరావుగారికి చందమామ బాధ్యతలు అప్పగించాక పిల్లలకు అర్థమయ్యే పెద్దల భాషని ప్రామాణిక భాష చేశారు. అదే శైలి ఇప్పటికీ కొనసాగుతుంది. ప్రపంచ సాహిత్యాన్ని పిల్లలకు పటికబెల్లంలా పంచిపెట్టింది మాత్రం చందమామే.

విద్వాన్ విశ్వం గారు పంచతంత్ర కథల్ని పంచభక్ష్యపరమాన్నాలుగా ప్రతినెలా వండివడ్డించేవారు.మరో కథని చెప్పటానికి బేతాళుడిని వసుంధరగారు తిరిగి చెట్టెక్కించేవారు. వడ్డాది పాపయ్య, చిత్ర, శంకర్, బాపు, ఆచార్య, వీరా, ప్రభాకర్ వంటి వారంతా చందమామకు రంగులద్దిన గొప్ప చిత్రకారులు. ముఖ్యంగా బేతాళ కథలకు బొమ్మలు వేసింది శంకర్ గారే. ఆ బొమ్మలు చూసి వాటితో స్నేహంచేసి పిల్లలంతా దెయ్యాలంటే మాకు ఏమీ భయం లేదనే స్థితికి వచ్చారు. చందమామలో దెయ్యాలన్నీ మంచి దెయ్యాలే కూడా.

అరేబియన్ నైట్స్ కథలు, రూపధరుని సాహస యాత్రలు, సర్పాయి పాపని కథలు, మర్యాద రామన్న కథలు వంటి జానపదగాథలకు చిరునామాగా నిలిచింది చందమామ.

బాపు బొమ్మలతో ఉత్పల సత్యనారాయణ గారి గంగావతరణం, క్షీరసాగర మథనం, కుమార సంభవం వంటివి సీరియల్‌గా వచ్చేవి.


డిజిటల్ ప్రపంచం ఇటీవల చందమామ పాత సంచికల్ని భద్రపరిచి అందరికి అందుబాటులో ఉంచింది. పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగపడే విషయాల్ని తేలిక పదాలతో అందించిన ఘనత చందమామదే. చందమామ పిల్లలపత్రిక అంటే చాలామంది పెద్దవాళ్లు ఒప్పుకోరు. అది అందరినీ అలరించి ఆకట్టుకుంది.

జీవన విధానాలు, తరాలు, అభిరుచులు మారినా కొన్ని ఎప్పటికీ మారకపోతేనే బాగుంటాయి. అటువంటి వాటిలో చందమామ ఒకటి. ఎందుకంటే “చందమామ”పత్రిక గురించి పొన్నపల్లి వారి భాషలో చెప్పాలంటే..” చిత్ర రుచుల పాలవెల్లి! నీతి కథల కల్పవల్లి!! సంస్కృతికది కన్నతల్లి!!!

# నేషనల్ జిమ్నాస్టిక్స్‌లో నన్నయ విద్యార్థి ప్రతిభ

**28.10.22 (మీడియాసెల్)**

36వ నేషనల్ గేమ్స్ 2022లో ట్రామ్పోలిన్ జిమ్నాస్టిక్స్ రిథమిక్ ఉమెన్ కెటగిరిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థిని షేక్ యాసిన్ ప్రతిభ కనపరిచి సిల్వర్ మెడల్ సాధించిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. శుక్రవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కార్యలయంలో షేక్ యాసిన్ ను వీసీ జగన్నాథరావు సన్మానించి రూ. 20 వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్టును అందించి మెడల్ తో సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ షేక్ యాసిన్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల ఐడియల్ కాలేజ్ లో డిగ్రీ ఫైనల్ విద్యార్థిగా జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభను కనపరచిందన్నారు. గుజరాత్ లో 36వ నేషనల్ గేమ్స్ 2022లో ట్రామ్పోలిన్ జిమ్నాస్టిక్స్ రిథమిక్ ఉమెన్ కెటగిరిలో సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడల్లోను రాణించాలని, విశ్వవిద్యాలయం తరుపున తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేసారు. షేక్ యాసిన్ వంటి ఎందరో ప్రతిభవంతులైన క్రీడాకారులను విశ్వవిద్యాలయం ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులకు చక్కని అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో పీజీలో ప్రవేశించి క్రీడలతో పాటు విద్యలోను ప్రతిభకనపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, ఫైనాన్స్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, సెవ్ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్, ఐడియల్ కాలేజ్ పీడీ అబ్బిబాబు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణిని అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు


# కాకినాడ క్యాంపస్‌లో వైద్య శిబిరం



**30.10.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో మెడికవర్ హాస్పిటల్స్ మరియు ఎన్.ఎస్.ఎస్ సంయుక్తంగా నిర్వహించిన హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఆదివారం క్యాంపస్ లో గల విద్యార్థులకు మరియు బోధన బోధనేతర సిబ్బందికి బిపి,షుగర్, ఇసిజి మొదలగు హెల్త్ టెస్టులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమలకుమారి, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జియోసైన్సెస్ వెబినార్



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని జియోసైన్సెస్ విభాగం భూరసాయన శాస్త్రానికి సంబంధించిన అంశాలపై రెండు రోజుల వెబినార్‌ను నిర్వహించింది. వెబ్‌నార్ కన్వీనర్, విభాగాధిపతి డా.కింతాడ నూకరత్నం మాట్లాడుతూ 18,19 తేదీలలో భూ రసాయన శాస్త్రానికి సంబంధించిన అంశాలపై వెబినార్ నిర్వహించామని అన్నారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సహంతో జియోసైన్సెస్ విభాగంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో డా.వి.బలరామ్, మాజీ ఎమెరిటస్ సైంటిస్ట్, చీఫ్ సైంటిస్ట్ మరియు హెడ్, జియోకెమిస్ట్రీ విభాగం, సి.ఎస్.ఐ.ఆర్, ఎన్.జి.ఆర్.ఐ., హైదరాబాద్ “ కరెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్ అండ్ డి అండ్ ఫ్యూచర్” అనే అంశంపై ఉపన్యసించారు. అలాగే జియోకెమికల్ మరియు జియోక్రోనాలాజికల్ అధ్యయనాల కోసం ప్రస్తుత మరియు అభివృద్ధి చెందుతున్న విశ్లేషణాత్మక పద్ధతులు తెలియజేసారు. ఎలిమెంటల్ మరియు ఐసోటోపిక్ జియోకెమికల్ అనాలిసిస్‌లో డేటా నాణ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ జియో ఇంజినీరింగ్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచి మాట




*సంగచ్ఛధ్వం సంవదధ్వం*
*సంవోమనాంసి జానతామ్!*
*దేవాభాగం యథాపూర్వే*
*సంజానానా ఉపాసతే !!*

మనం అందరం కలసి నడుద్దాం. కలసి పలుకుదాం. మన మనసులు ఒకటిగా చేసుకుందాం. మన పూర్వులు ఈ విధంగానే తమ కర్తవ్యాలను నెరవేరుస్తూ దేవతలుగా కీర్తింపబడ్డారు.

– ఉపనిషద్వాక్యం

# పంచుదాం!



ఒకరోజు ఒక గురువు గారు తన ఇద్దరు శిష్యుల్నీ పిలిచి, “ఈ రోజు మీరిద్దరూ పొరుగూరికి వెళ్లి రావాలి” అని చెప్పారు. ఒక సంచిలో ఆహారాన్ని నింపి, ఒక శిష్యునికి ఇచ్చి, “ఎవరైనా అవసరం ఉన్న వాళ్లు కనిపిస్తే వారికి ఈ ఆహారాన్ని పంచుకుంటూ వెళ్లు” అన్నాడు. రెండో శిష్యుడికి ఖాళీ సంచి ఇచ్చి ‘దారిలో ఏదైనా విలువైన వస్తువు కనిపిస్తే దాన్ని సంచిలో వేసుకుంటూ వెళ్లు’ అన్నారు.

ఇద్దరూ సంచుల్ని భుజాలకి తగిలించుకుని ప్రయాణం మొదలుపెట్టి నెమ్మదిగా నడుచుకుంటూ వెళు న్నారు. ఖాళీ సంచి వాడు ఆడుతూపాడుతూ నడుస్తున్నాడు. కొంత దూరం వెళ్లాక అతనికి ఒక విలువైన రంగు రాయి దొరికింది. దాన్ని తీసి సంచిలో వేసుకున్నాడు. మరికొంత దూరం వెళ్లాక మరొకటి కనిపించింది. దాన్ని తీసి సంచిలో వేసుకున్నాడు. అలా ఎక్కడ రంగు రాయి కనిపిస్తే దాన్ని తీసుకుని సంచిలో వేసుకుంటూ నడక సాగించాడు. దాంతో సంచి బరువెక్కసాగింది. నడక భారంగా మారింది. శ్వాస తీసుకోవడం కూడా ఇబ్బంది అయింది. ఉండేకొద్దీ అడుగు తీసి అడుగేయడమే చాలా కష్టమైపోయింది.

ఇక రెండోవాడు వెళ్తూ వెళ్తూ దారిలో ఆకలితో కనిపించిన వారికి తన సంచిలోని తిను బండారాలను కొంచెం కొంచెంగా పంచుకుంటూ వెళ్లాడు. క్రమంగా సంచి బరువు తగ్గి నడక సులభం అయింది. పంచుకుంటూ వెళ్లినవాడు తన గమ్యాన్ని తేలిగ్గా చేరుకోగలిగాడు. పోగేసుకుంటూ వెళ్లిన వ్యక్తి గమ్యాన్ని చేరుకోలేక పోయాడు. ప్రయాణమూ కష్టంగా సాగింది.

మరి మీరూ మనసు పెట్టి ఆలోచించండి. మీ గమ్యాన్ని ఎలా చేరుకోదలచుకున్నారు?

ఈ కథను తాత్విక దృష్టితో చూసినట్లయితే “విలువగలవైనా, లౌకిక విషయాలను, వస్తు సమాగ్రిని ప్రోగు చేసుకుంటూ వెళితే, జీవితం దుర్భరమవుతుంది. అదే మన ప్రేమనీ , జ్ఞానాన్నీ పంచుకుంటూ జీవన ప్రయాణం సాగిస్తే, మోక్షానికి చేరే మార్గం సుగమం అవుతుంది”. అదే ఈ కథలోని తత్త్వం. మానవునికి అనుసరణీయం.

# కాలంతో ప్రయాణం!



కాలం ఎప్పటికప్పుడు నన్ను పరీక్షిస్తూ ఉంటుంది.
నాకంట్టే వేగంగా నడిచి మాయమైపోతుంది.
ఎక్కడున్నావని వెతికితే
నీ నీడలో ఉన్నానని నవ్వుతుంది.
కాలం వేసే ఎత్తులను తట్టుకోలేక దాన్ని నా చేతితో పట్టుకున్నాను
కాసేపు కాలం నేను మాట్లాడుకున్నాం
కానీ..కొంత సేపటికి కాలం చేతులకు రెక్కలు వచ్చాయేమో..అది ఎగరడం ప్రారంభించింది.
దాన్ని గట్టిగా నొక్కిపెట్టి అదుపులో పెట్టాను..
ఒక దశలో ఎంత అదుపులో పెట్టిన నన్ను విడిచి వెళ్ళిపోయింది.
నాకు కూడా విసుగు పుట్టి నాదారి నేను చూసుకున్నాను.
కానీ..కొన్ని క్షణాల్లోనే కాలం పరిగెత్తుకు వచ్చి నన్ను కౌగిలించుకుని నీతో పాటు నేనుంటాను.. నిన్ను విడిచి ఉండలేనని ఆవేదనతో పలికింది.
కాలం అంతరంగాన్ని పసిగట్టిన నేను.. కాలం చేతిలో నాచేయి కలిపి మరింత ఉత్సాహంతో ముందుకు దూసుకుపోవాలని చూస్తున్నాను.
కాలం మాయాజాలం
చిత్రమైనది.

**- బి.సుశాంత్ కుమార్,**

**ఆదికవి నన్నయ యూనివర్సిటీ**

# నేనెందుకు చదువుతాను?


**(ఆంగ్ల మూలం: గేరీ పాల్సెన్ )**



నేను చదవకుండా ఉండలేను కాబట్టి చదువుతాను. నేర్చుకోవడానికి, ఎదగడానికి, నవ్వడానికి, స్ఫూర్తి పొందడానికి చదువుతాను. నాకు తెలియని విషయాలను అర్థం చేసుకోవడానికి చదువుతాను. నాకు చికాకుగా ఉన్నప్పుడు చదువుతాను. నేను ప్రేమించే వ్యక్తులతో పరమ మూర్ఖంగా మాట్లాడినప్పుడు చదువుతాను. నేను నిరాశలో కృంగిపోయినప్పుడు,భయంతో వణికి పోయినప్పుడు, మానసికంగా ముక్క చెక్కలయినప్పుడు కోలుకునే శక్తిని పొందడానికి చదువుతాను. అంతా సవ్యంగా నడుస్తున్నప్పుడూ చదువుతాను. జీవితంలో ఆశను అన్వేషించడానికి చదువుతాను. నేను కేవలం భావాలతో నిండిన చర్మపు తిత్తిని కాను, తినడం కోసమే బతికే మనిషినీ కాదు, నేను పదాలతో నిండిన మనిషిని, పదాలు నా ఆలోచనలను వర్ణిస్తాయి, నా గుండె లోతులలో దాగున్న విషయాలను వెల్లడిస్తాయి,పదాలు జీవంతో తొణికిస లాడుతుంటాయి. ఇష్టమైన పాటను మళ్ళీ మళ్ళీ పాడుకున్నట్లు నేను ఇష్టపడే కథను మళ్ళీ మళ్ళీ చదువుతాను. చదవడం అంటే క్రియా రహితంగా ఉండడం కాదు. పాత్రలతో పాటు నేనూ కథలోకి ప్రవేశిస్తాను. ఆ పాత్రలు పీల్చే గాలే నేనూ పీలుస్తాను. వాళ్ళ నిరాశ నిస్పృహలను అనుభవిస్తాను. వాళ్ళు ఏదైనా తెలివితక్కువ పని చేస్తుంటే, వద్దురా అని కోప్పడతాను. వాళ్ళతో పాటు నవ్వుతాను, ఏడుస్తాను. నా దృష్టిలో చదవడం అంటే ఒక స్నేహితుడితో సమయాన్ని గడపడం. పుస్తకాలు మన స్నేహితులు. ఈ స్నేహితులు ఎంతమంది ఉన్నా ఇంకా కొరతగానే ఉంటుంది.

(what's app నుండి సేకరణ)

# మార్గదర్శిగా నన్నయవాణి



తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు నన్నయవాణి పత్రిక మార్గదర్శిగా ఉంది. ఆదికవి నన్నయ పేరుతో ఏర్పడిన విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయాల స్థాయి తొలి తెలుగు పత్రికగా నన్నయవాణి వారపత్రికను తీసుకురావడం చాలా గొప్ప విషయం. ప్రధాన దినపత్రికల స్థాయిలో జర్నలిజం వార్త విలువలను పాటిస్తూ, సంపాదకీయాలు, వార్తలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ఇంటర్వ్యూలు, మంచిమాట, సూక్తి, ప్రత్యేక దినోత్సవ శుభాకాంక్షలతో ప్రతివారం నన్నయ విశ్వవిద్యాలయం దర్పణంగా నన్నయవాణి విడుదలవుతుంది. మహోన్నత సంకల్పంతో నన్నయవాణిని స్థాపించిన వీసీ ఆచార్య జగన్నాథరావుగారికి , సంపాదక మండలికి అంబేద్కర్ యూనివర్సిటీ తరపున అభినందనలు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు అన్ని వర్గాల వారికి నన్నయవాణిలో అవకాశం కల్పిస్తూ మంచి రచనలను, సమాచారాన్ని అందిస్తున్నారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రతిబింబంగా మిగిలిన విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా ఉన్న నన్నయవాణికి వార్షిక శుభాకాంక్షలు.

**- డా.లేబారు విజయ కృష్ణారెడ్డి (ఎల్వీకె)**

**డిప్యూటీ డైరెక్టర్,**

**డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్**

# ట్రైబల్ హార్టికల్చర్ సదస్సులో నన్నయ అధ్యాపకులు

డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం వారి ఆధ్వర్యంలో జరిగిన “ట్రైబల్ హార్టికల్చర్” జాతీయ సదస్సుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు హాజరయ్యారు. అక్టోబర్ 17,18 తేదీలలో జరిగిన ఈ సదస్సులో నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ సూచన మేరకు లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డా.పి.విజయనిర్మల, బోటనీ విభాగాధిపతి డా.కె.శామ్యూల్ కుమార్, డా.వి.పద్మావతి పాల్గొన్నారు. ఈ సదస్సుకు సంబంధించిన వివరాలను డా.పి.విజయనిర్మల తెలియజేస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, డా.వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీ, జె.ఎన్.టి.యు.కె, ఎన్.ఐ.టి లు క్లస్టర్ యూనివర్సిటీగా పని చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యాపరమైన, పరిశోధనపరమైన సదస్సులు, కార్యక్రమాలకు పరస్పర భాగస్వామ్యంతో హాజరై విజ్ఞానాన్ని పంచుకుంటున్నామన్నారు. ఈ నేషనల్ కాన్ఫరెన్స్ గిరిజన జనాభా యొక్క స్థితిని పెంపొందించడానికి మరియు భారతదేశంలోని గిరిజన సంఘాలను మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన విధాన బ్యాకప్‌తో తగిన పరిష్కారాలను అందించడానికి,




ప్రస్తుత సాధనాలు మరియు సాధనాల యొక్క సమగ్ర విశ్లేషణపై జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాలలో ఆర్థిక మరియు జీవనోపాధి భద్రత కోసం ఉద్యానవనం గిరిజన ప్రాంతాలలో జాతి మరియు ఉపయోగించని కూరగాయలు మరియు పండ్ల ద్వారా పోషకాహార భద్రత, గిరిజన హార్టికల్చర్‌లో జీవ వైవిధ్యం గిరిజన ఉద్యానవనాల ద్వారా మహిళా సాధికారత వ్యవస్థాపకత అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి సారించి గిరిజన ప్రాంతాల సుస్థిర అభివృద్ధిపై ఆసక్తి ఉన్న విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన ప్రణాళికలు, విస్తరణ నిపుణులు, విద్యార్థులు, రైతులు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ సదస్సు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు, హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డా.టి.జానకిరామ్ కు కృతజ్ఞతలు తెలియజేసారు.

# విద్యార్థుల 'వికాసం'

## - వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కరణం లచ్చారావుతో ముఖాముఖి



నిరుద్యోగులైన యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేరాఫ్ అడ్రాస్ గా నిలుస్తుంది వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను సైతం చక్కగా నిర్వహించడంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వికాస సంస్థ ఎంతో సహకారాన్ని అందిస్తుంది. ఈ క్రమంలో రికార్డు స్థాయిలో 1,03,403 మందికి ఉద్యోగాలనిచ్చి, డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అవకాశాలను కల్పిస్తున్నది వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్.

**సర్. నమస్సులు ! వికాస ప్రస్థానం ఎలా ప్రారంభమైంది?**

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా జయప్రకాష్ నారాయణ ఉన్న కాలంలో 1989వ సంవత్సరంలో వికాస సొసైటీ ప్రారంభించి, నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు (ఎన్.సి.ఎల్.పి)ను ప్రారంభించారు. క్రమంగా 2010లో వికాస సంస్థ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ లో ఉద్యోగులను నియమించాం. 2014 ప్రైవేటు ప్లేస్మెంట్స్ ప్రారంభించాం. 2019 ట్రైనింగ్, 2022లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ప్రారంభించాం. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ ఎంప్లాయబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ మిషన్ (NEEM), నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రాజెక్ట్ స్కీమ్ (NAPS) వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

**నిరుద్యోగులకు ఉద్యోగం కోసం ఎలా సంప్రదించాలి?**

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో వికాస ఆఫీసు ఉంటుంది. నిరుద్యోగులైన యువత నేరుగా వచ్చి సంప్రదించాలంటే వికాస ఆఫీసులో అప్లికేషన్ ఇవ్వచ్చు లేదా ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవచ్చు. www.vikasajobs.com వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏవైన సందేహాలు ఉంటే 0884 – 2352763/64/67/68 నెంబర్లను సంప్రదించవచ్చు.

**ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు?**

2013 ఏప్రియల్ నుండి 2022 అక్టోబర్ వరకు 103403 మందికి వికాస ఆధ్వర్యంలో ఉద్యోగాలు కల్పించాం. వాటిలో ఔట్ సోర్సింగ్ లో పని చేస్తున్నవారు 8,125 మంది ఉన్నారు. మిగిలిన ప్రైవేటు కంపెనీలలో పని చేస్తున్న వారు 95,278 మంది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్, ఆఫ్‌షోర్, ఐటి సేవలు, తయారీ పరిశ్రమ, ఫార్మా, హోటల్ ఇండస్ట్రీస్, కాల్ సెంటర్, బ్యాంకింగ్, ట్రైనింగ్ & మార్కెటింగ్ వంటి వివిధ రంగాలలో ఉన్నారు. సుమారు 100 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాం.

**వికాస జాబ్ మేళా ప్రత్యేకత ఏమిటి?**

విశ్వవిద్యాలయాలు, కళాశాలలు మరియు స్థానికుల సహకారంతో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తాం. ఎవరి దగ్గర డబ్బులు వసూళ్ళు చేయకుండా అన్ని సేవలు ఉచితంగా అందించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో 77 మెగా జాబ్ మేళాలు మరియు 551 మినీ జాబ్ మేళాలు నిర్వహించాం. వివిధ ప్రదేశాలలో నిర్వహించిన 655 జాబ్ మేళాలలో 3,18,358 మంది నిరుద్యోగులు మరియు 250 కంపెనీలు జాబ్ మేళాలలో పాల్గొన్నాయి. వీరిలో 33,348 మంది మహిళలు ఉండటం విశేషం. వికాస ద్వారా దేశ, విదేశాలలో యువత ఉద్యోగాలలో స్థిరపడ్డారు.

**వికాస ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఎలా ఉన్నాయి?**

విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. దానిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎంప్లాయబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ మిషన్ (NEEM) ప్రవేశపెట్టింది. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికాస సంస్థ ఎంపికకావడం గర్వకారణం. నీమ్ ద్వారా వికాస ఆధ్వర్యంలో మూడు వేల మందికి ట్రైనింగ్ ఇచ్చాము వారు వివిధ కంపెనీలలో పని చేస్తున్నారు. సాధారణ ఉద్యోగికి ఇచ్చే వేతనం మాదిరిగా స్టైఫండ్ ఇచ్చి ట్రైనింగ్ ఇస్తారు. అనంతరం అదే కంపెనీలో ఉద్యోగంలో స్థిరపడతారు. నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రాజెక్ట్ స్కీమ్ (NAPS)లో భాగంగా శిక్షణ అందిస్తున్నాం. అలాగే 10వ తరగతి నుండి డిగ్రీ వరకూ ఉన్న విద్యార్థులకు వికాస ఆధ్వర్యంలో శిక్షణ అందించి ప్లేస్మెంట్ ఇస్తున్నాం.

**ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌లో వికాస సహకారం?**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వికాస ఆధ్వర్యంలో ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించాం. కాకినాడ, తూర్పుగోదావ, కోనసీమ జిల్లాల్లో లోకల్ కంపెనీలలో నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తున్నాం. అలాగే టి.సి.ఎస్. వంటి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ఆరు వేల మంది విద్యార్థులకు టి.సి.ఎస్ ద్వారా ఇంటర్న్ షిప్ అవకాశాలను కల్పిస్తున్నాం. మొత్తం వికాస ఆధ్వర్యంలో 25 వేల మంది విద్యార్థులకు చక్కని ఇంటర్న్ షిప్ అవకాశాలు అందించాం.

**నన్నయ విశ్వవిద్యాలయ - వికాస సంబంధం?**

తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా వికాస నిర్వహిస్తున్న ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్ ను పూర్తిగా ఉపయోగించుకుంటున్న వారు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులు. నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుండి ఎక్కువ మంది యువత హాజరవుతారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు విశ్వవిద్యాలయ విద్యార్థులకు చక్కని ప్లేస్మెంట్స్ అందించాలని నిరంతరం సూచిస్తారు, ప్రోత్సహిస్తారు. వీసీ గారి ప్రోత్సాహంతోనే ఎక్కువ మందికి ఇంటర్న్ షిప్ అవకాశాలను కల్పించాం, విశ్వవిద్యాలయంలోను, ఆయా కళాశాలల్లోను మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నాం. త్వరలో విశ్వవిద్యాలయంతో మరిన్ని మెరుగైన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తాం. అలాగే విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సర్వీసెస్ విస్తృతపరుస్తాం.

**వికాస లక్ష్యం ఏమిటి?**

ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం తూర్పుగోదావరి, కాకినాడ, అమలాపూరం జిల్లాల్లో విస్తృత సేవలందిస్తున్నాం. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా వికాస ఆధ్వర్యంలో నిరుద్యోగులందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. చదువుకున్న ఏ ఒక్కరూ ఖాళీగా ఉండకూడదు. ఏదో పని చేస్తూ ఉండాలి, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. వికాస ఆధ్వర్యంలో త్వరలో మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తాం. వికాస కు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్లకు, విశ్వవిద్యాలయ అధికారులకు, కళాశాల యాజమాన్యాలకు ధన్యవాదాలు.

మంచిదండి. వికాస సంస్థ విద్యార్థుల్లో నైపుణ్యాలనే వికాసాలను నింపుతు ఉద్యోగాలను కల్పిస్తూ విజయోత్సహంతో ముందుకు సాగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం. వికాస సేవలకు నన్నయవాణి తరుపున కృతజ్ఞతల్ని అందిస్తుంది.

**నమస్కారం. మళ్ళీకలుద్దాం సర్.**

**- పువ్వల ఆనంద్,**
**యూనివర్సిటీ పి.ఆర్.ఓ.**

